# వి ముక్తి

వెంకట్రావూ!

నాలో బొత్తిగా చైతన్యం అనేదే లేదని, నాలాటి జడపదార్థంతో కాపురం చేయటం ఇంక ఎంతమాత్రం సాధ్యం కాదని ప్రొద్దున్న నువ్వు హఠాత్తుగా ప్రకటించాక....నమ్ము....నాకెంత పట్టరాని సంతోషం కలిగిందో నువు ఊహించలేవు. టిఫిన్ తింటున్న మా నాన్న, వడ్డిస్తున్న మా అమ్మ, నీకు కబుర్లు చెప్పి ఎంటర్టెయిన్ చేస్తూ నువు మరింత టిఫిన్ తినేందుకు కృషిచేస్తున్న మా అన్న గోడకు కొట్టిన బొమ్మల్లా నిర్ఘాంతపోవటం చూసి చెప్పొద్దూ....నాకు మరింత నవ్వు ముంచుకొచ్చింది. నా హావభావాలు దాచుకునేందుకు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. అపలేని ఆనందం నా మొహాన్ని వెలిగిస్తే, నేను ఒక్క నవ్వు నవ్వేస్తే, పాపం మా అమ్మ బెంబేలెత్తిపోయింది.

"నా మనసుకి గట్టిదెబ్బ తగిలిందనీ, భరించలేని బెంగతో, దిగులుతో నా మనసు మొద్దుబారిపోయి ఎట్లా వెర్రినవ్వులు నవ్వుతున్నానో నీకు సాక్ష్యాధారాలతో చూపిస్తూ విన్ను దయతలచమని వేడుకోవటం నాకింకా నవ్వు తెప్పించింది. సినిమాటిక్‌గా నాకు ఎగిరే పక్షులూ, పారే సెలయేళ్లూ, ఎంత ప్రయత్నించినా కళ్ళముందు కదల్లేదుకానీ, ఆ ఫీలింగ్ వచ్చిందని మాత్రం చెప్పగలను. నిజానికి, రాత్రే తతంగం పూర్తయిందని, నీవు కోరినట్లు సంతకాలు పెట్టేశానని, నీవు రేపే నీ కొత్త భార్యను గృహప్రవేశం చేయిస్తావని వాళ్ళకేం తెలుసు!

ఇంతకుముందే మీ ఫ్రెండ్ అదే...."లేకి వెధవలా నావైపు కళ్ళప్పగించి చూస్తాడనీ నేను చేసిన దిక్కుమాలిన వంటకాలు వెధవ పొగడ్తలు పొగుడుతూ మెక్కుతాడనీ" తిడతావే ఆ స్నేహితుడు ఫోన్ చేశాడు. "కొత్త సంవత్సరం మన ఇంట్లో ఆయనకు చాలా హేపీగా గడిచిందట. మీ ఇతర స్నేహితులు అదే మాట అన్నారని మీకు చెప్పమన్నాడు. ఎందుకు హేపీగా వుండదూ! పగలంతా నేను గొడ్డులా చాకిరీచేసి అమర్చిపెట్టిన ఫలహారాలు, పలావ్‌లు, బిర్యానీలు, నా డిగ్రీ తెలివితేటలతో చేసిన అరేంజ్‌మెంట్లూ, నీ డ్రింక్ పార్టీకి వేయించిన జీడిపప్పుతో మర్యాదలు ఇవన్నీ కలర్‌ఫుల్లే గదా!

అవ్వాళ నువ్వు పరిచయం చేసిన పరిమళా కలర్‌ఫుల్లే! కాదని నేనెలా అంటానూ. ఆ పిల్లకు పాపం వంటిల్లు సొంతం కాలేదుగా! ఇంట్లో అమ్మో, వదినో అన్నీ అమర్చిపెడితే హాయిగా తయారైపోయి మడత నలగని ఆర్గండీ చీరెతో పెదాలమీద చిరునవ్వుతో "షి ఈజ్ వెరీకలర్‌ఫుల్". పగలంతా ఎడతెగని చాకిరీతో, విశ్రాంతిలేని కళ్ళతో కనీసం స్నానం కూడా చేసే ఓపికలేని నాలో నీకు ఏం చైతన్యం కనబడుతుంది వెంకట్రావూ!

"ఏమిటీ మిసెస్ రావ్! డల్‌గా వున్నావు?" అని పరిమళ పలకరిస్తే,

"తనంతే టచ్‌మీ నాట్. ఆవిడకు మనుషులు పడరు, మనలోకం మనిషి కాదు" అని నీవు చీప్ జోక్స్ పేలిస్తే నాకూ నవ్వొచ్చింది. నీ సొంత సుఖం స్వార్థం తప్ప రెండో విషయం గురించి ఆలోచించని, మరి నీదేలోకం వెంకట్రావూ? అసలు నాలోకం గురించి నీకేంతెలుసనీ, ఏకోశానా నాలో ఉత్సాహం కనిపించదనీ, ప్రేమ, ఆనందం వంటి సాధారణ లక్షణాలు నాలో లేవనీ, నీవెంతో నష్టపోయావనీ నువు పరిమళతో చెప్పటం స్పష్టంగా విన్నాను నేను.

"ఇప్పటికీ మేం అపరిచితులమే పరిమళా" అన్నావు నీవు గొంతులో ఎక్కడ లేని ఆర్ద్రత కష్టపడి తెప్పించి; నిజమే, ఇది నూటికి నూరుపాళ్ళు నిజం. ఓ పుస్తకం చదవవనీ, సాహిత్య చర్చకు రానని, కవిత్వానికి నా మనస్సు పరవశం కాదనీ తపించే నీ హృదయవేదన నిజం. నిజం! మరి నన్ను పరిచయం చేసుకొన్నావా నువ్వు! నీ అలవాట్లు, నీ తిండి రుచులు నీ ఇష్టాల లిస్టులు అన్నీ వరుస బెట్టి చెప్పుకొచ్చావు. నిన్నెంత ప్రేమగా, అపురూపంగా పెంచుకొచ్చారో మీ అమ్మ గారు చెప్పగా విన్నా, ఆవిడ నెత్తిమీద నుంచి (కనీసం మీ బాధ్యత అన్నా పాపం తప్పింది) నీ భారం నేను భుజాలమీద వేసుకొన్నా. తిండి, ఇస్త్రీలు, స్నానం, పడకా, అన్నీ నేనే ఇన్నాళ్ళ నుంచి నా సొంత పనుల కంటే శ్రద్ధగా నిర్వహించా. ఇన్ని సేవలు నా దగ్గరి నుంచి కష్టంతో సహా పుచ్చుకొన్నప్పుడైనా ఒక్కసారి దయతలచి, నా ఇష్టాలేమిటి అని అడిగావా వెంకట్రావూ!

మీ స్నేహితులతో చర్చలకు నేను 'టీ'లు పెట్టిచ్చాను. మీరంతా తగలేసిన సిగరెట్ల గుట్టలు ఊడ్చిపెట్టాను. మీవంటి మహానుభావుడి కోసం ఎవరైనా వస్తే తలుపుచాటు నుంచి సమాచారం అందించా. నాలుగు కాఫీలు పెట్టమని లోపలికి కేకలు పెట్టావుగానీ, నలుగురూ వచ్చారు, సరదాగా కబుర్లు చెప్పుకుందాం రమ్మని ఎప్పుడైనా పిలిచావా? నేనెలా తెలుస్తాను నీకు! చీకటిని చీల్చుకొనివచ్చే ఉషఃకిర

కాలు చూడటం నాకిష్టం. నువ్వు ఎనిమిదయితే కాని లేవవు. లేచేసరికి, గడ్డం గీక్కొనేందుకు వేడినీళ్ళతో సహా టిఫిన్ రెడీ అవ్వాలి. ఇక నాకు ఉషోదయాలెక్కడ, నిద్రమొహంతో గిన్నెలు తోమటం తప్పించి. వెన్నెల్లో కూర్చుని కబుర్లు చెప్పుకోవటం నాకిష్టం. మరి వెన్నెలా, పడకా చూచేక రెండో కబురు చెప్పనీయకుండా నామీద పడిపోయి ఐదో నిమిషంలో నిద్రలో రిలాక్స్ అవటం నీకిష్టం. వర్షం వస్తే ఒక్కో చినుకూ చెట్లమీది నుంచి నిశ్శబ్దంగా జారిపడుతుంటే చినుకు చినుక్కీ భాష్యం చెప్పుకోవటం నాకిష్టం. మరి నీకో! వర్షం చినుకు కనిపించగానే, పకోడీలు, బజ్జీలు తింటే బావుంటుందని గుర్తురావటం, అవన్నీ సిద్ధంచేసి నీకు తినిపించేసరికి నే చూడాలనుకున్న వర్షం కురిసి వెలిసిపోవటం జరిగేది. ఇవన్నీ నీకు చెప్పలేకపోయాను.

నాకు చెప్పటం రాదన్నావు నిజమే. నిరంతరం నడ్డివిరిగే చాకిరితో నిన్ను చూసి చిరునవ్వు కురిపించే తీరిక ఎక్కడా? కష్టపడి పనిచేసి వస్తే పాపాయి అల్లరి, ఏడుపు నీకు సరిపడదని, నీవు వచ్చేప్పటికి దాన్ని నిద్రపుచ్చాలని రూలుపెట్టావు, పగలంతా పాపాయిని నిద్రపోనీయక కూర్చోపెట్టి సరిగ్గా నువ్వు వచ్చే వేళకు దాన్ని నిద్రపుచ్చే పనిలో పగలూ, రాత్రీ నేను సతమతం. అంచేత నీవు తెచ్చిన మల్లెలు అందుకొని ఆనందించే ఓర్పు నాకేది? మన పరిచయం అక్కడే ఆగిపోయింది. అయినా నాకు బెంగలేదు. నీకు ఒకందుకు కృతజ్ఞతలు చెప్పాలనిపించింది, నన్నొది లేశావ్ అంతే చాలు. రెండు రోజులు ఏడుపు మొహం పెడితే చాలు. ఆపైన అంతు లేని విశ్రాంతి. పాతికేళ్ళకే అంతా ముగిసిపోయినందుకు ఇంటిల్లిపాదీ నాపై కురిపిస్తున్న జాలి, ప్రేమ నువ్వు నా పట్ల దయచూపి నన్ను వదిలేసినందుకే దక్కాయి. మేధావి భార్యగా నా అవతారం ఇక చాలిస్తున్నందుకు సంతోషం ఇంకెవరూ నా పనికి వంకలెంచరు. నా ఇష్టాలతో పనిలేకుండా నీ ఆవేశాలు భరించటం, నీ గొప్పలు వినటం తప్పినందుకు మరింత ఆనందం.

వెంకట్రావు పెళ్ళాం పాత్ర ముగించి మళ్ళీ నేనెవరో నా ఉనికేమిటో తెలుసుకుని నిలబడేందుకు కాస్త సమయం పడుతుందేమో, అయినా పర్వాలేదు. నువ్వు కత్తిరించివేసిన నా రెక్కలు మెల్లమెల్లగా మొలుచుకొస్తాయి. నీతో సహ జీవనం చేసిన దారుణమైన గతంలోంచి బయటపడ్డాక, చేజార్చుకున్న చదువుని గుర్తు తెచ్చుకొంటానో, అప్పడాలే వత్తుకుంటానో, ఏదైనా కానీ రాబోయేవి బంగారురోజులు. ఆరోజులు నాకిచ్చిన నీకు మరోమారు కృతజ్ఞతలతో ....

ఒకప్పటి నీ పాదదాసి

(ఆదివారం ఆంధ్రజ్యోతి)